క్లుప్తంగా

హిందీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లతో విద్యార్థులు

పద్మనాభం: మండలంలోని పొట్నూరు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు దశమందం విద్యా సేవా సదన్ ఆధ్వర్యంలో నవంబర్‌లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన హిందీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పరీక్షల్లో పదిమంది పతకాలు సాధించారు. వీరిలో ఆరుగురు బంగారు పతకాలు, నలుగురు వెండి పతకాలు సొంతం చేసుకున్నారు. 26 మందికి మెరిట్ సర్టిఫికెట్లు వచ్చాయి. విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన హిందీ టీచర్ డి.చిన్నారిని పాఠశాల హెచ్‌ఎం బి.అప్పలరాజు, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

కూలిన నిఘానేత్రం



కూలిన సీసీ కెమెరా స్తంభం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం కూడలి వద్ద సీసీ కెమెరాలు చేసిన స్తంభం కూలిపోయింది. సోమవారం వేకువ జామున తిమ్మాపురం నుంచి మారికవలస వెళ్తున్న పొక్లెయిన్ ఈ స్తంభాన్ని ఢీకొనడంతో కూలిపోయింది. వేకువజాము కావడంతో అదృష్టవశాత్తు ఎవరికీ, ఎటువంటి ప్రమాదం జరగలేదు.

మాజీ కౌన్సిలర్ అన్నపూర్ణ మృతి



అన్నపూర్ణ (ఫైల్)

తగరపువలస: భీమిలి మున్సిపాల్టీ మాజీ కౌన్సిలర్ చేట్ల అన్నపూర్ణ అస్వస్థత కారణంగా సోమవారం మృతి చెందారు. ఈమె గతంలో తగరపువలస పీఏసీఎస్ డైరెక్టర్‌గా, ఫుడ్ కమిటీ సలహాదారుగా కూడా పని చేశారు. అన్నపూర్ణ అంత్యక్రియలు చిట్టివలస శ్మశానవాటికలో మంగళవారం జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇక్కడ రికార్డులు, ఓపీ, ఐపీ, ఈహెచ్‌ఆర్, డయగ్నస్టిక్ సేవలు, మందుల లభ్యత, ముఖ్యంగా ఎన్‌సీడీ 3.0 సర్వే, ఆర్‌బీఎస్‌కే, ఆర్‌కేఎస్‌కే తదితర అంశాలపై ఆరా తీశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. కాంప్రహెన్సివ్ స్క్రీనింగ్, రిఫరల్ సేవల గురించి వైద్య సిబ్బందికి విశదీకరించారు. ప్రతి ఒక్కరూ ముఖహాజరు విధిగా వేయాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమావతి, యూపీహెచ్‌సీ వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


కుటుంబం చెంతకు వృద్ధుడు



బంగారును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పీఎం పాలెం పోలీసులు

పీఎం పాలెం: అడ్రస్ మరచిపోయి అటూఇటూ తిరుగుతున్న వృద్ధుడిని పీఎం పాలెం పోలీసులు ఆయన కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. వివరాలివి.. మధురవాడకు చెందిన అలబోయిన బంగారు(82) తను వచ్చిన దారి, ఇంటి చిరునామా మరిచిపోయి గాయత్రి ఇంజినీరింగ్ కళాశాల పరిసరాలలో సోమవారం ఉదయం పదిగంటల సమయంలో తచ్చాడుతున్నారు. ఆ వృద్ధుడిని చూసిన కళాశాలకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి మోహన్ శివకుమార్, ఆయన్ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు వృద్ధుడి వివరాలు సేకరించి ఆయన కుటుంబ సభ్యులకు అప్పగించారు. విద్యార్థిని పలువురు అభినందించారు.

మృత్యుకుహారం



రిజర్వాయర్ దిగువభాగంలో నాచు కట్టిన నీరు లేని భాగం

గంభీరం రిజర్వాయర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. జీవీఎంసీ తాగునీటి అవసరాలకు ఉపయోగపడే ఈ రిజర్వాయర్ సుమారు 300 ఎకరాలలో విస్తరించినా, ఇక్కడ కాపలాదారులు లేరు. ఒకరిద్దరు మత్స్యకారులు రిజర్వాయర్ గట్టుపై మత్స్యసంపదకు కాపలా ఉండి హెచ్చరించినా.. పెడచెవిన పెడుతున్న యువత వారిపై దాడులు చేసి మరీ ప్రమాదాలకు బలవుతున్నారు. ఏటా సగటున పది మందిని రిజర్వాయర్ పొట్టన పెట్టుకుంటుండగా, వీరిలో విద్యార్థులే ఎక్కువ కావడం శోచనీయం.



రిజర్వాయర్ వద్ద నీటిలోకి డైవ్ చేసే ప్రమాదకరమైన లాకు

ప్రమాదాలకు నిలయంగా గంభీరం రిజర్వాయర్

తగరపువలస:

ఆనందపురం మండలంలోని గంభీరం రిజర్వాయర్ ఈత రాని వారు లోపలికి అడుగుపెడితే ప్రాణాలు తోడేస్తోంది. స్నేహితులతో సరదాగా వచ్చి, మద్యం సేవించి కాసేపు నీటిలో దిగుదామనుకునేవారు నాచుపట్టిన రాళ్ల మధ్య ఇరుక్కుని ఉండిపోతున్నారు. సెల్ఫీల మోజు, లాకులపై నుంచి నీటిలో డైవ్ చేసేవారు సైతం ప్రమాదాల బారిన పడి ప్రాణాలు పణంగా పెడుతున్నారు. ఏటా సగటున పది మందిని రిజర్వాయర్ పొట్టన పెట్టుకుంటోంది. వీరిలో విద్యార్థులే ఎక్కువమంది కావడం గమనార్హం. పుట్టినరోజు, వీకెండ్, సెలవురోజుల్లో సరదాగా గడపడానికి గూగుల్ సాయంతో చేరుకుంటున్న యువకులు ప్రమాదకరమైన గుమ్ముల నుంచి తెలియక.. కన్నవారికి కడుపుశోకం మిగులుస్తున్నారు. ఇటీవల వరుస ప్రమాదాలలో మరణించిన విద్యార్థులు కొమ్మాది, రుషికొండకు చెందిన ప్రముఖ విద్యాసంస్థల వారే.



అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా రిజర్వాయర్ గట్టు మార్గం



రిజర్వాయర్ చుట్టూ నాచుపట్టిన ప్రమాదకర రాతిబండ

మళ్ల అప్పారావు గుమ్మిలో దిగితే అంతే..

రిజర్వాయర్ చుట్టూ నివాసం ఉంటున్నవారికి తప్పితే బయట వారికి ఈ రిజర్వాయర్ లోతుపాతులు తెలియవు. 1957లో పాత రిజర్వాయర్‌ను కూల్చి రెండు కొండల నడుమ కొత్త రిజర్వాయర్ నిర్మించినప్పుడు శిథిలాలు, వాలు, పైపు లు నాచుపట్టి ఇప్పటికీ ప్రమాదకరంగా ఉన్నాయి. చుట్టూ బండ పేర్పు ద్వారా జరిగిన నిర్మాణం వద్ద లోతు 6 అడుగుల పైనే ఉంటుంది. లాకుల వద్ద తాటిచెట్టు లోతు ఉంటుంది. రిజర్వాయర్‌లో మళ్ల అప్పారావు గుమ్మి (ఊబి) ప్రాంతం మరీ ప్రమాదకరమని స్థానికులు తెలిపారు. ఇక్కడ లోతు, వాలు ఎక్కువగా ఉంటుందని, అందులో అడుగు పెడితే మాత్రం చిక్కుకుపోయి, తిరిగి రావడం కష్టమేనని తెలియజేశారు. వేసవిలో సైతం నిండుగా కనిపించే రిజర్వాయర్ ఇప్పటి వరకు వేలాది మందిని మింగేసింది. సంబంధిత అధికారులు స్పందించి, రిజర్వాయర్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు నెలవు

ఆది, మంగళవారాలలో ఎక్కువగా బయటవ్యక్తులు ఈ రిజర్వాయర్ గట్టుపై మద్యం సేవించి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటారు. మద్యం సీసాలను రిజర్వాయర్‌లో విసిరేస్తుంటారు. ఇటీవల అటవీశాఖ రిజర్వాయర్‌కు చేరుకునే కొన్ని మార్గాలు మూసివేసినా, దుక్కవానిపాలెం మీదుగా మరికొన్ని రహస్య మార్గాలలో చేరుకుంటున్నారు. ఈ రిజర్వాయర్ పక్కనే అభయారణ్యం ఉండటంతో పగటివేళ పక్షులు, చీకటిపడితే నక్కలు, జింకలు, పాములు, అడవిపందులు, కొండ చిలువలు, అడవి పిల్లులు ఇక్కడికి చేరుకుంటాయి.



రిజర్వాయర్ చుట్టూ మద్యం సీసాలు

ఈత వచ్చినా తప్పించుకోలేరు



ఈత వచ్చినా రిజర్వాయర్‌లో ప్రమాదకర పాయింట్లు తెలియకపోతే బయటపడలేరు. దీనికి తోడు మద్యం మత్తులో మరింత ప్రమాదాలకు గురవుతుంటారు. చుట్టుపక్కలవారు వద్దని చెబితే తగాదాలకు వస్తారు. చివరకు వీరినే విగతజీవులుగా బయటకు తీయాల్సిన పరిస్థితులు ఉంటున్నాయి.

– ఇల్లిపల్లి నరసింగరావు, దుక్కవానిపాలెం

కచ్చితంగా కాపలాదారు ఉండాలి



రిజర్వాయర్‌లో ప్రమాదాలు తగ్గాలంటే కచ్చితంగా జీవీఎంసీ కాపలాదారులను, ఈతగాళ్లను నియమించాలి. నాచు కట్టిన ప్రదేశాలు, లాకుల మీదకు వెళ్లకుండా హెచ్చరికల బోర్డులు ఉంచాలి, నీటిలో ఎవరూ దిగకుండా ఫెన్సింగ్ నిర్మించాలి.

– ఇల్లిపల్లి శ్రీనివాసరావు, దుక్కవానిపాలెం

మాపై దాడులు చేస్తారు..



మేము మత్స్యకార సొసైటీ తరపున రిజర్వాయర్‌లో చేపలకు రాత్రీపగలు కాపలా ఉంటాం. నిత్యం ఆకతాయిలు వస్తుంటారు. వద్దన్నా రిజర్వాయర్‌లోని లాకుల మీద నుంచి దూకుతారు. ఇక్కడే మందు తాగుతారు. పోలీసులకు చెబుదామంటే ఫోన్లు లాక్కుని నీటిలోకి విసిరేస్తుంటారు.

– కుప్పు కృష్ణ, మత్స్యకార సొసైటీ ప్రతినిధి

నాచు, గుమ్ము, లోతు వల్లే ప్రమాదాలు



రిజర్వాయర్ చుట్టూ నీరు లేని ప్రాంతంలో కూడా నాచు, గుమ్ములు, తెలియని లోతు ప్రాణాలు తీస్తున్నాయి. దిగిన వెంటనే క్షణాలలో గుమ్ములలో చిక్కుకుపోతున్నారు. ఈతకు ఈ రిజర్వాయర్ అంత మంచిది కాదు.

– తమ్మిన సురేష్, దుక్కవానిపాలెం

గంభీరం పాఠశాలకు కొత్త భవనం

- రౌండ్‌టేబుల్ సంస్థ రూ.50 లక్షల విరాళంతో నిర్మాణం



ప్రారంభించిన పాఠశాల నూతన భవనం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం మండల ప్రాథమిక పాఠశాలకు నగరానికి చెందిన రౌండ్ టేబుల్ స్వచ్ఛంద సంస్థ రూ.50 లక్షలతో నాలుగు గదుల పాఠశాల భవనాన్ని నిర్మించింది. సోమవారం ఆ భవనాన్ని ప్రారంభించారు. దాతలు మజ్జి కేశవ, అనికేతవర్మ, గన్నమనేని మురళి మాట్లాడుతూ భవిష్యత్తులో పాఠశాలకు అదనపు వసతులు కూడా సమకూరుస్తామన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయుడు యు.వి.వి.ప్రసాద్‌కు సూచించారు. కార్యక్రమంలో బుల్లయ్య కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపాల్ కేసీ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో ఎస్.జానకి, విద్యాశాఖ అధికారులు వి.జోగిందర్, గంగరాజు, రౌండ్ టేబుల్ సభ్యులు అభిషేక్, చైతన్య, అమిత్‌చౌదరి, ముక్బాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపైనే అన్‌లోడింగ్



ప్రధాన రహదారిపైనే అన్‌లోడ్ చేస్తున్న ముఠా కార్మికులు



నిలిచిపోయిన ట్రాఫిక్

- 15 నిమిషాలు నిలిచిపోయిన 222 ఆర్ సిటీ బస్
- స్తంభించిన ట్రాఫిక్

తగరపువలస: స్థానిక ప్రధాన రహదారిపై సోమవారం మధ్యాహ్నం అడ్డంగా లారీని నిలబెట్టి బియ్యం అన్‌లోడ్ చేశారు స్థానికంగా ఓ కిరాణా వ్యాపారి. దీంతో తగరపువలస నుంచి రైల్వే స్టేషన్ కు వెళ్లవలసిన 222 ఆర్ బస్సు 15 నిమిషాలు నిలిచిపోయింది. ఆ వెనుకే పలు వాహనాలు నిలిచిపోయాయి. లారీని అడ్డు తియ్యమన్నందుకు అన్‌లోడింగ్ చేసే ముఠా కార్మికులు బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. స్థానికులు కల్పించుకుని లారీ డ్రైవర్‌ను హెచ్చరించడంతో అతి కష్టం మీద అడ్డం తీశాడు. విషయం భీమిలి ట్రాఫిక్ పోలీ సులకు తెలియడంతో రూ.1635 చలానా విధించారు. తగరపువలసలోని పలు రహదారులపై పగటి వేళ భారీ వాహనాలకు ప్రవేశం లేకపోయినా,నిత్యం ఇదే తంతు జరుగుతోంది. దీంతో ఎక్స్‌ప్రెస్ బస్సులతో పాటు సిటీ బస్సులు తగరపువలస కూడలి నుంచి కాకుండా బైపాస్‌రోడ్డు మీదుగా వెళ్లిపోతు న్నాయి. దీంతో ప్రయాణికులు దూరంగా నడచి వెళ్లవలసి వస్తోంది. పగటిపూట తగరపువలస రహదారులపై భారీ వాహనాలను నిషేధించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విద్యార్థి స్థాయికి అనుగుణంగా బోధించాలి

- సమగ్రశిక్ష అభియాన్ ఏడీ చంద్రశేఖరరావు

మధురవాడ: విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధన చేసినప్పుడే వారి అభ్యసన స్థాయి పెరుగుతుందని విశాఖపట్నం సమగ్ర శిక్ష అభియాన్ అదనపు సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖరరావు అన్నారు. ఉపాధ్యాయులకు ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) 9వ బ్యాచ్ శిక్షణను ఆయన ప్రారంభించారు. మధురవాడ ఐటీ సెజ్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ వరకు ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ, అల్లూరి జిల్లాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వీరికి ప్రథమ్ జిల్లా కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, కేఆర్‌పీ సమత, గొట్టేటి రవి తదితరులు శిక్షణ ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పద్మనాభం: ఆర్‌వీ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరం టెన్త్ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయకలయిక సోమవారం పాఠశాలలో జరిగింది. బ్యాచ్‌కు చెందిన 21 మంది విద్యార్థులు హాజరై, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను, అప్పటి బోధనేతర సిబ్బందిని సన్మానించారు. పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించడానికి నిర్ణయించారు. భీమునిపట్నం ఎంపీడీవో హనుమంతురావు, రిటైర్డ్ ఎంఈవో జి.విశ్వంరాజు, పాఠశాల హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు. పూర్వ ఉపాధ్యాయులు ప్రసాదరావు, శారద, సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

నమామి శ్రీవాణి.. స్మరామి గీర్వాణి



కొమ్మాది జంక్షన్ త్రిశక్తి ఆలయంలో ..



అష్టలక్ష్మీ ఆలయంలో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

సకల విద్యాప్రదాయిని సరస్వతీ దేవి. ఆ శ్రీవాణి ఆవిర్భవించిన వసంత పంచమి వేళ విద్యార్థులు భక్తిశ్రద్ధలతో చదువులతల్లిని అర్చించారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలను వేడుకగా జరిపించారు. కొమ్మాది అన్నంరాజు నగర్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారిని విద్యారూపిణిగా అలంకరించి, పూజలు చేశారు. వందమంది విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. మంగమారిపేట హంసవన పుణ్యక్షేత్రం రామాద్రిలో కదంబవనవాసిని సరస్వతి దేవిగా దర్శనమిచ్చారు. బీచ్ రోడ్డు సాగర్‌నగర్ మహాలక్ష్మి ఆలయంలో, చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో, కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో, బక్కన్నపాలెం రోడ్డులోని శ్రీ శృంగేరీ శంకర మఠంలో సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. కొమ్మాది జంక్షన్ త్రిశక్తి ఆలయంలో అమ్మవారిని వీణాధారిగా అలంకరించగా, విద్యార్థులు విశేష పూజలు చేశారు. పద్మనాభం మండలం ఆర్‌వీపురం జెడ్పీ హైస్కూల్లో, గణేష్‌నగర్ వద్ద గల వివేకానంద కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సరస్వతీ పూజలు చేశారు. చంద్రంపాలెం హైస్కూల్లోని సరస్వతీ ఆలయంలో హెచ్‌ఎం రవి, పూర్వ విద్యార్థులు పూజలు చేశారు.

–కొమ్మాది/మధురవాడ/పద్మనాభం/పీఎం పాలెం



సరస్వతి అలంకరణలో బబ్బేలమ్మ అమ్మవారు

ఆర్‌వీపురం జెడ్పీ హైస్కూల్లో సరస్వతీదేవి విగ్రహం వద్ద పూజలు



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో పిల్లలకు అక్షరాభ్యాసం చేస్తున్న అర్చకులు



వివేకానందనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సరస్వతీ పూజ

పాఠశాల అభివృద్ధికి కృషి

తగరపువలస: పాఠశాల అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని జీవీఎంసీ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్ తెలిపారు. గతంలో ఇక్కడ పని చేసిన అప్పలరాజు అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్‌కు తెలుగు ఉపాధ్యాయునిగా పదోన్నతిపై వెళ్లనుండటంతో ఆయన నుంచి రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుగత మల్లిక, ఈగల సంజీవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఐటీ బకాయిల చెల్లింపునకు జెడ్సీకి వినతి

మధురవాడ: గతంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల జీతాల నుంచి వసూలు చేసిన ఆదాయ పన్ను మొత్తాన్ని వెనక్కి ఇప్పించాలని సీఐటీయూ నాయకులు జోనల్ కమిషనర్ ఫణిరాంను కోరారు. ఈ మేరకు జోనల్ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. పన్ను వసూలు చట్ట విరుద్ధమని, జోన్–2 పరిధిలో కార్మికుల ఖాతాలకు ఐటీ బకాయిలు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు డి. అప్పలరాజు, ఎంవీ ప్రసాద్, సీహెచ్ శేషుబాబు, రాములప్పడు, నాగరాజు పాల్గొన్నారు.

సోదర ప్రేమకు మహోన్నత నిదర్శనం లక్ష్మణుడు

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- కొనసాగుతున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలు



ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: సోదర ప్రేమకు లక్ష్మణుడు మహోన్నతమైన ఉదాహరణ అని ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. అన్నగారి పట్ల తమ్ముడికి ఎంత ప్రేమ ఉండాలి అనే విషయం రామలక్ష్మణుల సంభాషణలో మనకు తెలుస్తుందన్నారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో జరుగుతున్న సంపూర్ణ శ్రీరామాయణం ప్రవచనాల్లో భాగంగా 10వ రోజు, సోమవారం ఆయన ప్రవచించారు. శ్రీరామాయణంలో సుమిత్ర మాట్లాడిన ప్రతి మాట ఒక మెరుపు అని, త్యాగం విషయంలో లక్ష్మణునికి ఆవిడ చేసిన దిశానిర్దేశం చాలా గొప్పవన్నారు. శ్రీరాముడు సీతా లక్ష్మణ సమేతుడై అరణ్యవాసానికి బయల్దేరడం, తమ వెంట వస్తామన్న ప్రజలను శ్రీరాముడు వారించడం, తమసా నదిని దాటి అరణ్యవాసం ప్రారంభించడం తదితర విషయాలు వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి దంపతులు, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

భీమునిపట్నం: విశాఖలో రెండు రోజుల క్రితం జరిగిన కరాటే జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన కీతిన్‌పేట సన్‌స్కూల్ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు సోమవారం అభినందించారు. ఈ పోటీల్లో పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న యువన్ కాటా, ఫైట్ విభాగాల్లో బంగారు పతకాలు, పూర్ణ చంద్రశేఖర్ కాటా విభాగంలో బంగారం, ఫైట్ విభాగంలో వెండి పతకం సాధించారు. ఐదో తరగతి చదువుతున్న యశిక కాటా విభాగంలో వెండి పతకం సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

ఆటో ఢీకొని బైకిస్ట్ మృతి

పీఎం పాలెం: ఎదురుగా వస్తున్న బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో బైకిస్ట్ మరణించాడు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి.. మధురవాడ సాయిప్రియ గార్డెన్స్‌లోని మైల్‌స్టోన్ టెన్నిస్ కోర్టు కీపర్‌గా పని చేస్తున్న కంచర్ల యేసుబాబు (25) ఈ నెల 2వ తేదీ ఉదయం 11గంటల ప్రాంతంలో తన పల్సర్ బైక్‌పై కార్‌షెడ్ కూడలి నుంచి క్రికెట్ స్టేడియం వైపునకు ప్రయాణిస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు డ్యూటీ డాక్టర్ ధ్రువీకరించారు. మృతుడిని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి బంధువు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ధ్యానంపై అవగాహన



విద్యార్థులతో ధ్యానం చేయిస్తున్న సొసైటీ ప్రతినిధి లక్ష్మి

తగరపువలస: భీమిలిలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ధ్యానంపై అవగాహన కల్పించారు. సొసైటీ ప్రతినిధులు పి.సంతోషి, పి.లక్ష్మి, కె.ఫణీంద్ర, కె.వెంకటరావు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి ధ్యానం నేర్చుకోవడం వలన ఉన్నతమైన జీవన విధానం అలవడుతుందన్నారు. విద్యార్థులలో మంచిని పెంపొందించేందుకు తమ సొసైటీ కృషి చేస్తోందన్నారు. ధ్యానం వల్ల కలిగే లాభాల గురించి విద్యార్థులకు వివరించారు. వారితో కాసేపు ధ్యానం చేయించారు.